క్లుప్తంగా

రైతు సంక్షేమమే ధ్యేయం



పమిడిముక్కల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. మండలంలోని ఐనంపూడిలో శుక్రవారం ఆయన పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఐనంపూడి రైతు సేవా కేంద్రం పరిధిలో ఇప్పటివరకు 298 మంది రైతులకు సంబంధించిన 447 ఎకరాల్లో పంట నష్టం కింద నమోదు చేసినట్లు ఏఓ గణేష్‌రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు.

ఏచూరి మృతి తీరని లోటు



పామర్రు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, సీపీఎం నాయకులు చాట్ల శ్రీనివాసరావు, చికిరి వెంకటేశ్వరరావు, దునుకు రఘునాథరావు, కార్మిక సంఘ నాయకులు వేము పెదబాబు, చాట్ల రాంబాబు, సాల్మన్‌రాజు కొల్లాబత్తుల, ననావుల్లా, ఈడే కృష్ణ, కైలే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

మండవల్లి: మణుగునూరులో వరద ముంపునకు గురైన బాధితులకు ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా సెక్రెటరీ దేవదాసు ప్రేమ్‌బాబు ఆధ్వర్యంలో కూరగాయల పంపిణీ చేశారు. వేమవరప్పాడుకు చెందిన శ్రీరంగపురం గ్రామ బ్లూ బాయ్స్ సేవా సంస్థ ఆర్థిక సాయంతో వాటిని అందజేశారు.

వంతెనపై రాకపోకలు పునరుద్ధరణ



నందివాడ: బుడమేరు శాంతించడంతో నందివాడ–పుట్టగుంట వంతెన వరద నీటి నుంచి బయటపడింది. దీంతో వంతెనపై రాకపోకలను అధికారులు శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. ఈ మేరకు వంతెనపై ఉన్న బురదను శుభ్రం చేసి ద్విచక్రవాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు అధికారులు పేర్కొన్నారు. వరద ఉధృతి తగ్గిన అనంతరం పెద్ద వాహనాలను కూడా అనుమతిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ విలువలు అలవర్చుకోవాలి

కైకలూరు: విద్యార్థి దశ నుంచి ఉత్తమ విలువలను అలవర్చుకోవాలని వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో 2024–25 విద్యా సంవత్సరంలో నూతనంగా చేరిన విద్యార్థులకు వారం రోజులు నిర్వహించిన ప్రేరణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, జనరల్ క్విజ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెయ్యేరు కాలనీలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గణపతి విగ్రహానికి పూజలు చేసి, సమారాధన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు జాస్తీ చంటిబాబు, ముక్కు వెంకటేశ్వరరావు, సాక్షి సాయిబాబు, జంపన కోటయ్య, ముత్యాల రాంబాబు, దివి సతీష్, దేశిన అమలేశ్వరరావు, గంటా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారిపై వరద నీటితో అవస్థలు



మండవల్లి: మండలంలోని దెయ్యంపాడు వద్ద పులపర్రు రహదారిపై వరద నీరు పారుతోంది. దీంతో వాహనదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పక్కన ఉన్న కాలువలోని నీరు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణించడానికి మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వర్షం నీరు చేరి అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల కంట కన్నీరు

- నట్టేట ముంచిన వరదలు
- తూతూ మంత్రంగా పంట నష్టం అంచనాలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలతోపాటు వరదలు రైతన్నలను కోలుకోలేని దెబ్బతీశాయి. రైతన్నలకు ఊహించని విధంగా నష్టాన్ని మిగిల్చాయి. ముంపు దెబ్బకు పొలాలు నదులుగా మారాయి. రోజుల తరబడి వర్షం నీటిలో వరి పైరు ఉండిపోవడంతో పూర్తిగా కుళ్లిపోయింది. మొత్తానికి వరదలు రైతుల కంట కన్నీరు మిగిల్చాయి.

గుడివాడరూరల్: వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఆశ పడుతున్న వారికి అధికారుల పంట నష్ట అంచనాలు కంటవింపుగా మారాయి. తూతూమంత్రంగా అంచనాలు వేసి రైతులు నష్టపోయింది కొండంత ఉండగా ఆ నష్టాన్ని గోరంతగా అధికారులు చూపడంపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ మండలంలో 14,675 ఎకరాలు, నందివాడ మండలంలో 4,262 ఎకరాలు, గుడ్లవల్లేరు మండలంలో 22,493 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 15రోజుల క్రితం వరదలు వచ్చే సమయానికి పంట పొట్టదశలో ఉంది. ఈ సీజన్‌లో ప్రారంభ సమయంలోనే వర్షాలకు నారుమడులు దెబ్బతిన్నాయి. రైతులు మళ్లీ నారుమడులు వేసి, పంట సాగు చేశారు. వరదలు వచ్చే సమయానికి ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. మొత్తం సాగు చేసిన రైతుల్లో సగానికి సగం అప్పులు చేసి సాగు చేసిన కౌలు రైతులే ఉన్నారు.

అధికారుల అంచనాలు ఇలా..

వరదలతో దెబ్బతిన్న పంట పొలాలపై అధికారులు పంట నష్టాన్ని ఇలా తేల్చారు. గుడివాడ మండలంలో 14,675 ఎకరాలు సాగు చేయగా దీనిలో 1,928 ఎకరాలు దెబ్బతిని 909 మంది రైతులు నష్టపోయారు. నందివాడ మండలంలో 4,262 ఎకరాలు సాగు చేయగా 3,602 ఎకరాల పంట దెబ్బతిని 1,610 మంది రైతులు నష్టపోయారు. గుడ్లవల్లేరు మండలంలో 22,493 ఎకరాల్లో సాగు చేయగా



కుళ్లిపోయిన వరిని చూపుతున్న రైతు

1,602 ఎకరాల్లో పంట దెబ్బతిని 1,063 మంది రైతులు నష్టపోయినట్లుగా అధికారులు నివేదికలో తేల్చారు. దీంతో పంట నష్ట అంచనాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ మండలంలో చంద్రయ్య, మోటూరు డ్రెయిన్లు, లేళ్లపూడి, గుడివాడ చానల్స్ పూడిక తీయకపోవడంతో వరదలు ఎగదన్ని పంట పొలాలను ముంచెత్తాయి. పలు మైనర్ చానల్స్, కాల్వలు వలన పంట పొలాలు ఇప్పటికీ ముంపు బయటకు పోక నానుతూనే ఉన్నాయి. పంట పొలాలు పూర్తిగా తేలక ముందే 1,928 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు తేల్చారు. నష్టం ఐదు వేల ఎకరాల వరకు మండలంలో దెబ్బతిన్నట్లుగా రైతులు చెబుతున్నారు. రైతుల మాటలకు, అధికారుల అంచనాలకు పొంతనలేకుండా పోయింది. నందివాడ మండలంలో బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్లతో పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తమిరిశ గ్రామంలోనూ చంద్రయ్య డ్రెయిన్ వలన పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నా, అధికారులు మాత్రం 3,602 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు నివేదికలో చూపడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో 22,493 ఎకరాలు సాగు చేయగా 1,602 ఎకరాలు మాత్రమే నష్టపోయినట్లు లెక్కలు చూపడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఏడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు మరోసారి దృష్టిసారించి సర్వే చేసేలా చూసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



పెద ఎరుకపాడులో పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పంట మొత్తం పోయింది



ఖరీఫ్ సీజన్‌లో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. పంట బాగానే ఉందనుకునే సమయంలో వరద పంటను కబళించింది. పంట పూర్తిగా బుడమేరు పాలైంది. పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– జనార్దనరావు, కౌలు రైతు, ఎల్ఎన్‌పురం

అప్పుల ఊబిలో కూరుకుపోయా



మాది ఎల్ఎన్‌పురం. బుడమేరు పక్కనే 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. రూ.2.30 లక్షల వరకు అప్పు చేశాను. పంట చేతికి వస్తుందనే ఆశలో ఉన్నాను. వర్షాలు, వరదల రూపంలో పంట మొత్తం నీటి పాలైంది. మొత్తం 10 ఎకరాలు కుళ్లిపోయి పనికి రాకుండా పోయింది. అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎం.గాంధీ, ఎల్ఎన్‌పురం

రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మొవ్వ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మొవ్వ మండలంలోని అయ్యంకి, చినముత్తేవి, అవురుపూడి, పాలంకిపాడు, కోసూరు, కాజ, పెద్దారాయుడు తోట గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలను, పంటలకు జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రస్తుతానికి పొలాల్లో నీరు తగ్గినా పంట కుళ్లిపోయిన స్థితికి చేరుకుందన్నారు. పంట నష్టం అంచనా వేయటంలో నష్టపోయిన ప్రతి రైతుకీ నిష్పక్షపాతంగా పరిహారం అందేవిధంగా అధికారులు అంచనాలు వేయాలన్నారు. పంటలు ముంపునకు గురయ్యే నాటికి ఒక్కొక్క ఎకరానికి రూ.15వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారన్నారు. అయితే కేవలం ఎకరానికి రూ.6,800 ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.15వేలు నేరుగా సాగుదారుని ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఎరువులను నూరు శాతం సబ్సిడీపై ఇవ్వాలి

నీట మునిగిన పంటను రక్షించుకునేందుకు వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు యూరియా, పొటాష్‌ను పైరుపై పిచికారీ చేయాలని చెబుతున్నారని, ముంపు ప్రాంతాల్లోని రైతులకు యూరియా, పొటాష్ నూరు శాతం సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రెయిన్లలో పూడిక తీయకపోవటం ఈ ముంపునకు ప్రధాన కారణం అని అనిల్‌కుమార్ పేర్కొన్నారు.



మొవ్వ మండలంలో పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

రైతుల పక్షపాతి వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ రైతుల పక్షపాతి అని కైలే అనిల్‌కుమార్ అన్నారు. రైతులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి పక్షాన పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సర్పంచ్‌లు నాగనబోయిన సునీల్, తాతా స్వప్న, నాయకులు గోగినేని పెరుమాళ్లు, మండ శ్రీనివాసరెడ్డి, పేకేటి సీతారామిరెడ్డి, ఆంజనేయులు, బాలేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపుదలకు కృషి

పామర్రు: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపుదలకు మానవత సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ కృష్ణా జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అరండాల్‌పేట–2 ప్రాథమిక పాఠశాలకు మానవత జీవిత కాలపు సభ్యులు అల్లాడ సోమశేఖర్‌రావు సీత దంపతుల సౌజన్యంతో బీరువాను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతుల నిర్వహణ, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు నగదు బహుమతులను అందిస్తున్నామన్నారు. మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, ప్రెసిడెంట్ వెంకటనారాయణ, కార్యదర్శి అరిగెల బాలుడు, పాఠశాల హెచ్‌ఎం మృదుల, డైరెక్టర్లు నర్సింహారావు, రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు బీరువాను అందజేస్తున్న దాతలు

లక్ష్మణరెడ్డి సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఉన్న చీఫ్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. కర్నూలులో శుక్రవారం జరిగిన లక్ష్మణరెడ్డి పదవీ విరమణ సభలో జిల్లా సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పాల్గొని ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ లక్ష్మణరెడ్డి కృష్ణాజిల్లాలో అనేక అనధికార లేఅవుట్‌లు క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేటట్టు చేశారన్నారు. ఎస్సీ వాడల్లో శ్మశాన భూముల సమస్యల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సమాచార హక్కు చట్టం కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, బయవరపు దుర్గాప్రసాద్, బొల్లా శివపార్వతి, సిరివెళ్ల గౌరీ పేర్కొన్నారు.



లక్ష్మణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న జిల్లా సమాచార హక్కు చట్టం కార్యకర్తలు

రైతుల పంట నష్టం జాబితా ప్రదర్శన



పామర్రులో పంట నష్టం జాబితాను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

పామర్రు: ఇటీవల భారీ వర్షాలతో పంట నష్టం జరిగిన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. స్థానిక పామర్రు వ్యవసాయ మార్కెట్‌లోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పంట నష్టపోయిన రైతుల జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన పంట నష్టం వివరాలను రైతుల పేర్లను ఈ జాబితాలో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రైతులందరూ పంట నష్టం జాబితాను సరిచూసుకుని, వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేసి, సరి చేసుకోవాలని కోరారు. ఎవరైనా రైతులకు పంట నష్టం జరిగి, జాబితాలో పేరు లేదని తమకు తెలియజేస్తే వారి పొలాలను మళ్లీ అధికారులు పరిశీలించి, జాబితాలో పేర్లు చేర్చనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ అభ్యంతరాలను ఈ నెల 16వ తేదీ లోపుగా తెలియజేస్తే, సరి చేసి ప్రభుత్వానికి తుది జాబితాను పంపిస్తామన్నారు. ఏఓ శివనాగరాణి, వీఏఏ కిరణ్, రైతులు బి.అప్పిరెడ్డి, బి.శశిరెడ్డి పాల్గొన్నారు.



అంగలూరు పంట నష్ట అంచనా నివేదికను చూపుతున్న ఏఓ సునీల్

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వరదలకు జరిగిన పంట నష్ట అంచనాల నివేదికలను ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని ఏఓ ఎల్.సునీల్ తెలిపారు. శుక్రవారం అంగలూరులోని పంట నష్ట అంచనాల నివేదికను ప్రదర్శించారు. కార్యదర్శి ఎలీషారావు, వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

బుడమేరు వరదతో 13 గ్రామాల మునక

డీఎల్‌పీఓ సంపత్‌కుమారి

గుడివాడరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నందివాడ మండలంలో 13 గ్రామాలు ముంపునకు గురయ్యాయని గుడివాడ పంచాయతీ డివిజనల్ అధికారి (డీఎల్‌పీఓ) జి.సంపత్‌కుమారి తెలిపారు. నందివాడ మండలం పుట్టగుంట గ్రామం వద్ద బుడమేరు పరివాహక ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో బుడమేరు వరదలతో 166 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 37 షెడ్లు కూడా నీటిలో మునిగిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించినట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని పునరావాస కేంద్రాలను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ రామ్మోహన్‌రావు, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బుడమేరును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

నాట్య గణపతికి ప్రత్యేక పూజలు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిని శ్రీ నాట్య గణపతిగా అలంకరించి, భక్తుల దర్శనానికి ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు శ్రీ లక్ష్మీ గణపతి హోమ పూజలు

శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు

పామర్రు: స్థానిక చల్లపల్లి రోడ్డులోని పరిశ వెంకటరత్నం అండ్ సన్స్, క్రాంతి ట్రాన్స్ పోర్ట్స్, సాయి గోవర్ధన్ ట్రాన్స్‌పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి చలువ పందిరిలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు ఘంటసాల మురళీకృష్ణ, అరవపల్లి రావు, గుడివాడ శ్రీనివాస్ ఆలపించిన భక్తి గీతాలను శ్రోతలను ఆకట్టుకున్నాయి. అనంతరం గాయకులను ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పరిశ వెంకట నాంచారయ్య, సాంబశివరావు, రజని పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పుల్లల పాడు వంతెన వద్ద గల శ్రీ బాలగణపతి ఆలయంలో శుక్రవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేద పండితులు స్వర్ణ శివరామకృష్ణ పర్యవేక్షణలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



శ్రీ నాట్య గణపతిగా స్వామి వారు

పామర్రులో..

పామర్రు: గణపతి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఏడో రోజు స్థానిక తోటలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలోని వినాయకస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మచిలీపట్నం పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, పామర్రు మండల పార్టీ అధ్యక్షుడు కుదరవల్లిప్రవీణ్, టౌన్ సెక్రటరీ మంతెన రామాంజనేయులు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కేదరాసిపల్లి శ్రీను, చాట్ల చిన రమేష్ తదతరులు పాల్గొన్నారు.

ఇక్బాల్‌బాషా మృతికి సంతాపం



ఇక్బాల్ బాషా (ఫైల్)

గుడివాడ టౌన్: వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు మహమ్మద్ ఇక్బాల్ బాషా(65) శుక్రవారం మృతి చెందడంతో పలువురు సంతాపాన్ని తెలియజేశారు. ముస్లిం మైనార్టీ నాయకుడిగా, గుడివాడ షాదిఖానా కమిటీ అధ్యక్షుడిగా గతంలో బాధ్యతలు నిర్వహించారు. గుడివాడ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ వన్ ఉపాధ్యక్షుడిగా ప్రజలకు సేవలందించారు. ఈయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఇక్బాల్ మృతిపట్ల మాజీ మంత్రులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), పిన్నమనేని వెంకటేశ్వరరావు, కఠారి ఈశ్వర్‌కుమార్, గుడివాడ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, మైనార్టీ సంఘాల పెద్దలు సంతాపం తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు: విజయవాడ అజిత్‌సింగ్ నగర్ వడ్డెర కాలనీకి చెందిన 300 మంది వరద బాధితులకు గుడివాడ నియోజకవర్గ ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు, కొన్ని రకాల నిత్యావసరాలను అందించారు. ఈ విషయాన్ని ఆ సంఘ కార్యదర్శి డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి సాగిరాజు ఉదయ భాస్కర్, నియోజకవర్గ అధ్యక్షుడు పంగ ఎర్రంనాయుడు, నాయకులు సింహాచలం, చంద్రశేఖర్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వెంట్రప్రగడ (పెదపారుపూడి): ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివనాగమణి, అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలోని వెంట్రప్రగడ, అప్పికట్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ముంపు సమస్య పరిష్కారానికి కృషి

మండవల్లి: కొల్లేరు వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. కొల్లేరు ప్రాంతంలోని వరద ముంపు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయబోమని, కొల్లేరు ముంపునకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్నారు. కొల్లేరు ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రతీ గ్రామంలోనూ మంచినీటి చెరువుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రోడ్లు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వరదలతో నష్టపోయిన ప్రతిఒక్కరికీ పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: మండలంలోని కొమరవోలు, జమీగొల్వేపల్లి గ్రామ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు మచిలీపట్నం ఏపీసీపీ డీసీఎల్ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. కొమరవోలులో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, జమీగొల్వేపల్లిలో ఉదయం 11.00 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని పమిడిముక్కల, కృష్ణాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: విద్యుత్ లైన్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా గుడివాడ పట్టణంలో శనివారం ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ టి.రామకృష్ణ తెలిపారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ, కాజ సబ్ స్టేషన్ల పరిధిలోని ఐదు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. మొవ్వ, కూచిపూడి, పెదపూడి, కాజ, నిడుమోలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో కోడూరు, పేరూరు, 11 కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పేర్ని రవికుమార్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంతో విద్యార్థులకు భవిత

మండవల్లి: వాస్తవికతకు ఎంత దగ్గరగా ఆలోచించగలిగితే అంత మార్పు వస్తుందని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సర ప్రారంభోపన్యాసం శుక్రవారం నిర్వహించారు.

వరద బాధితులకు సాయం



కైకలూరు: వరద బాధితులను ఆదుకోడానికి స్వచ్ఛందంగా దాతలు ముందుకొస్తున్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు పలువురు చెక్కులు, నగదును సీఎం సహాయనిధికి అందించారు. వీరిలో తాడనాడ సియోను ప్రార్థన మందిరం పాస్టర్ విద్యాసాగర్ రూ.1.5 లక్షలు, చినతాడినాడకు చెందిన పద్మావతి ఫౌండేషన్ సభ్యులు జంపన వెంకటసుబ్బరాజు, రామరాజు రూ. లక్ష, జనసేన నేత వర్రే హనుమాన్ రూ.లక్ష, కైకలూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రూ.50 వేలు అందించారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

మండవల్లి: మండవల్లి పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు కొనసాగుతున్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డులో పేరు మార్పు, అడ్రస్ మార్పు తదితర కార్యక్రమాలపై మండవల్లి పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు.